RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

# అన్వేషణనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 107 | శుక్రవారం 21 ఆగస్టు 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## 'వందేమాతరం'పై కాంగ్రెస్ నిర్ణయం దేశాన్ని అవమానించడమే

**ఇంటర్నెట్ డెస్క్:**

'వందేమాతరం' విషయంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (జఔజ) 1937 నాటి తీర్మానాన్ని అనుసరిస్తూ జాతీయ గేయంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించడం దేశాన్ని అవమానించడమేనని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయం జాతి వ్యతిరేకమని ఆరోపించారు. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం కేవలం రాజకీయ నిర్ణయం కాదని, దేశ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని అమిత్‌షా పేర్కొన్నారు. 'వందేమాతరం'పై కాంగ్రెస్ తీసుకున్న వైఖరికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

**భారత్ విభజనకు కాంగ్రెస్ విధానాలే కారణం**

కాంగ్రెస్ గతంలో అనుసరించిన సంతుష్టీకరణ విధానాల వల్లే దేశం రెండు ముక్కలైందని అమిత్‌షా ఆరోపించారు. గతంలో చేసిన తప్పుల నుంచి కాంగ్రెస్ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. 'వందేమాతరం' విషయంలోనూ అదే విధానాన్ని కొనసాగిస్తోందని అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పాకిస్థాన్ హైకమిషన్ బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్ తొలగించిన అధికారులు..

2

భారత్-పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాక్‌కు భారత అధికారులు షాక్ ఇచ్చారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్, ఇతర భద్రతా ఏర్పాట్లను తొలగించారు. దీంతో వీసా విభాగం సమీపంలోని క్యూలైన్ ఏర్పాట్లు, బారికేడ్లను జేసీబీ సాయంతో తొలగించారు.



# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి..

**ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి**

**అగ్రనేతల ఘన నివాళి..**

భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఇవాళ (ఆగస్టు 20) ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించుకోతగినది అని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు.

వార్త 2లో



## 'ప్రక్షాళన' వివాదంపై మౌనం.. కాంగ్రెస్ నేతల తీరుపై ఖర్గే అసంతృప్తి!

2

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో తన ప్రసంగం అనంతరం చోటుచేసుకున్న 'ప్రక్షాళన' వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో సొంత పార్టీ నేతలు తనకు బహిరంగంగా మద్దతు ఇవ్వకపోవడంపై ఆయన మనస్తాపం చెందినట్లు సమాచారం. బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఖర్గే ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.



2



## జెన్ జీ పేరుతో బెదిరింపులా? వైరల్ వీడియోపై వీకే సింగ్ కీలక వ్యాఖ్యలు

లద్దాఖ్‌లోని మినామార్గ్ చెక్‌పోస్టు వద్ద ఓ పర్యాటకురాలు భద్రతా సిబ్బందితో వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిబ్బందిని ప్రశ్నించినట్లు వీడియోలో కనిపిస్తోంది.

## మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు: ఎంపీ లక్ష్మణ్

2



రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు.



2

## వన్ వేపై సర్‌ప్రైజ్ చెక్.. సామాన్యుడిలా బైక్‌పై కేబీఆర్‌కు సీపీ సజ్జనార్

హెచ్-సిటి ప్రాజెక్టులో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల కారణంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఆగస్టు 18 నుంచి వన్-వే ట్రాఫిక్ విధానం అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే.

## మంత్రి పొంగులేటికి సవాల్.. వివరణ ఇచ్చే వరకు కదిలేది లేదు

2



తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థులు రోడ్లపై సమ్మె చేయడం బాధాకరం: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

2



# పాకిస్థాన్ హైకమిషన్ బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్ తొలగించిన అధికారులు..

న్యూఢిల్లీ: అన్వేషనేత్రం ప్రతినిధి

భారత్–పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాక్‌కు భారత అధికారులు షాక్ ఇచ్చారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్, ఇతర భద్రతా ఏర్పాట్లను తొలగించారు. పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల అనుమతి ఇచ్చిన పరిధికి బయట కొన్ని నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వీసా విభాగం సమీపంలోని క్యూలైన్ ఏర్పాట్లు, బారికేడ్లను జేసీబీ సాయంతో తొలగించారు.ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ వెలుపల పాక్ ఇలాంటి చర్యలకే పాల్పడింది. ఆ ఘటన జరిగిన మూడు రోజులకే భారత్ అధికారులు తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో దీనిని 'టిట్ ఫర్ టాట్'గా పలువురు భావిస్తున్నారు. అయితే పాకిస్థాన్ హైకమిషన్ వద్ద నిర్మాణాల తొలగింపును ఇస్లామాబాద్‌లోని పరిణామాలకు ప్రతీకారంగా చేసినట్లు కేంద్రం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, ఇరుదేశాలు దౌత్య కార్యాలయాల చుట్టూ భద్రతా ఏర్పాట్లను తొలగించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.ఇదిలా ఉండగా, జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పర్యటించిన అమెరికా రాయబారి సెర్జియో గోర్ వ్యాఖ్యలు పాకిస్థాన్‌కు ఆగ్రహం తెప్పించాయి. భారత్‌లో జమ్మూకశ్మీర్ ముఖ్యమైన భాగమని ఆయన అనడంతో పాటు, కశ్మీర్ లోయలో భద్రతా పరిస్థితులు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. అమెరికా ప్రయాణ హెచ్చరికలను పునఃపరిశీలించే అవకాశం ఉందనీ సంకేతాలిచ్చారు. అమెరికా రాయబారి వ్యాఖ్యలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇస్లామాబాద్‌లోని అమెరికా ఛార్జ్ డి'అఫైర్స్ నాటలీ బేకర్‌ను పాక్ విదేశాంగ శాఖ పిలిపించుకుని నిరసన తెలిపింది. జమ్మూకశ్మీర్ అంశంపై తమ వైఖరిని పాకిస్థాన్ మరోసారి స్పష్టం చేసింది.

# 'ప్రక్షాళన' వివాదంపై మౌనం.. కాంగ్రెస్ నేతల తీరుపై ఖర్గే అసంతృప్తి!

ఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో తన ప్రసంగం అనంతరం చోటుచేసుకున్న 'ప్రక్షాళన' వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో సొంత పార్టీ నేతలు తనకు బహిరంగంగా మద్దతు ఇవ్వకపోవడంపై ఆయన మనస్తాపం చెందినట్లు సమాచారం. బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఖర్గే ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. హల్ద్వానీలో తాను ప్రసంగించిన వేదికను అనంతరం 'శుద్ధి' చేశారనే అంశంపై ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి.ఆగస్టు 8న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీకి ఖర్గే వెళ్లారు. అక్కడ ఆయన ప్రసంగించిన వేదికను కొందరు 'ప్రక్షాళన' చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై ఖర్గే గతంలో బహిరంగంగానే స్పందించారు. తన ప్రసంగం అనంతరం అదే ప్రదేశంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటన కుల వివక్షకు సంబంధించినదిగా పేర్కొంటూ బీజేపీపై విమర్శలు చేశారు. అయితే ఈ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని బీజేపీ స్పష్టం చేసింది.ఈ వివాదంపై పార్టీకి చెందిన పలువురు నాయకులు తనకు మద్దతుగా స్పందించకపోవడం ఖర్గేను బాధించిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న తనకు ఇలాంటి సందర్భంలో నేతల నుంచి మద్దతు ఉంటుందని ఆయన ఆశించినట్లు తెలుస్తోంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. సొంత పార్టీ నేతల మౌనం తనను నిరాశకు గురిచేసిందని ఖర్గే చెప్పినట్లు సమాచారం. పార్టీ అంతర్గతంగా ఈ అంశంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

# జెన్ జీ పేరుతో బెదిరింపులా? వైరల్ వీడియోపై వీకే సింగ్ కీలక వ్యాఖ్యలు

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

లద్దాఖ్‌లోని మినామార్గ్ చెక్‌పోస్టు వద్ద ఓ పర్యాటకురాలు భద్రతా సిబ్బందితో వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వాహనాలను చాలాసేపు నిలిపివేయడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని ప్రశ్నించినట్లు వీడియోలో కనిపిస్తోంది. తాము జెన్ జీ తరానికి చెందినవారమని పేర్కొంటూ, ఇలాంటి పరిస్థితులను అంగీకరించబోమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

### వాస్తవాలు తెలుసుకోవాలి: వీకే సింగ్

ఈ ఘటనపై మాజీ ఆర్మీ చీఫ్, కేంద్ర మాజీ మంత్రి జనరల్ వీకే సింగ్ స్పందించారు. సాయుధ బలగాలు దేశానికి రక్షణ కవచంలా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సైనికులపై విమర్శలు చేసే ముందు అక్కడి పరిస్థితులు, వాస్తవాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సైనికులపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు ప్రజలు అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు.
అసలు మినామార్గ్ చెక్‌పోస్టు వద్ద ఏం జరిగింది?లద్దాఖ్‌లోని మినామార్గ్ ప్రాంతంలో వాహనాలను గంటల పాటు నిలిపివేయడంతో పర్యాటకురాలు భద్రతా సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. కుటుంబాలతో, చిన్న పిల్లలతో ప్రయాణిస్తున్న వాహనాలను ఎందుకు ఎక్కువసేపు ఆపారని ఆమె నిలదీసినట్లు వైరల్ వీడియోలో కనిపిస్తోంది.
ఆ సమయంలో భద్రతా కాన్వాయ్ అక్కడికి చేరుకోవడంతో రహదారి పక్కకు వెళ్లాలని సిబ్బంది ఆమెకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో రహదారిని కేవలం వీఐపీ కాన్వాయ్ కోసం మాత్రమే నిలిపివేశారని ఆమె ఆరోపించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు, అధికారిక వివరణ ఇంకా స్పష్టంగా వెలువడాల్సి ఉంది. లద్దాఖ్‌లోని పర్వత ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం, రహదారి పరిస్థితులు, భద్రతా కారణాల దృష్ట్యా వాహనాల రాకపోకలను నియంత్రించడం సాధారణమేనని అక్కడి అధికారులు పేర్కొన్నారు.

# వన్ వేపై సర్‌ప్రైజ్ చెక్.. సామాన్యుడిలా బైక్‌పై కేబీఆర్‌కు సీపీ సజ్జనార్

హైదరాబాద్,

హెచ్–సిటి ప్రాజెక్టులో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల కారణంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఆగస్టు 18 నుంచి వన్– వే ట్రాఫిక్ విధానం అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీపీ సజ్జనార్ వన్ వే ట్రాఫిక్‌పై సర్‌ప్రైజ్ చెక్ నిర్వహించారు. సామాన్యుడిలా బైక్‌పై ప్రయాణిస్తూ ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. రోడ్ నంబర్ 45 నుంచి ఫిల్మ్‌నగర్ వరకు బైక్‌పై రెండు సార్లు తిరుగుతూ ట్రాఫిక్‌ను పరిశీలించారు.జంక్షన్‌లలో విధుల్లో ఉన్న పోలీసులతో ట్రాఫిక్‌పై సీపీ ఆరా తీశారు. మధ్యాహ్నం కూడా మరోసారి ట్రాఫిక్ సరళిపై పర్యవేక్షించారు. వన్‌వే కారణంగా తొలి రోజు వాహనదారులు కొంత అయోమయానికి గురైనప్పటికీ.. రెండో రోజు రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని సజ్జనార్ తెలిపారు. అన్ని జంక్షన్‌లలో స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. జీహెచ్ఎంసీ, నిర్మాణ సంస్థ సమన్వయంతో ఎ–జంక్ పనులు జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు సహకారించాలని కోరారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి..

## ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి అగ్రనేతల ఘన నివాళి..




న్యూఢిల్లీ: అన్వేషనేత్రం ప్రతినిధి

భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు ఇవాళ (ఆగస్టు 20) ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించుకోతగినది అని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు.

మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు.

### గుడ్‌విల్ డే..

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ (గుడ్‌విల్ డే) జరుపుకుంటారు. ఈ రోజు మాజీ ప్రధాని ప్రతిపాదించిన విలువలను స్మరించుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యువతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయాలు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

# మంత్రి పొంగులేటి క్షమాపణ చెప్పడం సిగ్గుచేటు: ఎంపీ లక్ష్మణ్

న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22ఏ భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు.అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# మంత్రి పొంగులేటికి సవాల్.. వివరణ ఇచ్చే వరకు కదిలేది లేదు: ఏలేటి మహేశ్వర్ రెడ్డి..

హైదరాబాద్:

తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి నిన్న (బుధవారం) సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు.తన సవాల్‌ను స్వీకరించి చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు. ఈ సందర్భంగా భూభారతి, 22ఏలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలకు భూ బదలాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు తాను కదిలేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇస్తారా? లేక పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇస్తారా? అంటూ సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఎవరొచ్చినా సరే తన వద్ద ఉన్న ఆధారాలను అందిస్తానని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యార్థులు రోడ్లపై సమ్మె చేయడం బాధాకరం: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్:అన్వేషనేత్రం ప్రతినిధి

విద్యార్థుల భవిష్యత్ ను సిఎం రేవంత్ రెడ్డి పాతాళంలోకి తొక్కారని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్ పై రేవంత్ కు శ్రద్ధ లేదని, డబ్బు సంపాదించుకోవడంపైనే రేవంత్ శ్రద్ధ అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం పాలిటెక్నిక్ చేసి..పాలిటెక్నిక్స్ లోకి వచ్చారని, పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ చేసి ఇంజనీరింగ్ లోకి పోతే తప్పు ఏంటి? అని విద్యార్థులతో రేవంత్ ఒక్క రోజైనా మాట్లాడారా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అని సిఎం మాట్లాడుతున్నారని, పిల్లలను సిఎం దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడించాలని అన్నారు. తరగతి గదుల్లో ఉండాల్సిన బిడ్డలు రోడ్లపై ఉన్నారని, విద్యార్థులు రోడ్లపై సమ్మె చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 4వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేస్తున్నారని, రూ.400 కోట్లు ఇస్తే పాలిటెక్నిక్ కళాశాలలు బాగుపడతాయని తెలియజేశారు. ఫోర్త్ సిటీ పేరుతో భూ దందా నడుస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు.

# భారత దేశానికి కంప్యూటర్లను పరిచయం చేసింది రాజీవ్ గాంధే: అడ్లూరి లక్ష్మణ్

దేశ భవితకు పునాది వేసిన నేత రాజీవ్ గాంధీ.. ప్రపంచం గర్వించే విధంగా భారతదేశాన్ని నడిపించిన నాయకులు.. దేశ ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబం.. రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి.. ధర్మపురి: నేడు ప్రపంచ దేశాలతో పోటీపడి ప్రపంచం గర్వించే విధంగా భారతదేశం ఎదగడానికి కారణం దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలోని నంది చౌరస్తాలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో భారత దేశానికి కంప్యూటర్లను పరిచయం చేశారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో మొదలైన కంప్యూటర్ ఈరోజు సాఫ్ట్ వేర్ రంగంలో భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని ప్రశంసించారు. లక్షలాదిమంది నైపుణ్యం పెంచుకొని ప్రపంచ దేశాల్లో సాఫ్ట్ వేర్ రంగాల్లో స్థిరపడ్డారని తెలియజేశారు.ాశ్రీంశీ =ఘుు – విద్యార్థులు రోడ్లపై సమ్మె చేయడం బాధాకరం: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతకు ఎన్నికల్లో అవకాశం కల్పించాలని ఓటు హక్కు వయసు 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి భారతదేశ ప్రజాస్వామ్యంలో యువతను భాగస్వాములను చేశారని అన్నారు. దేశ ఐక్యత కోసం రాజీవ్ గాంధీ అనేక కార్యక్రమాలు నిర్వహించి ముందుకు సాగారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతకు సమగ్రతకు పాటుపడాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్ తో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు వేముల రాజు, సౌళ్ల భీమన్న తదితరులు పాల్గొన్నారు.



అన్వేషనేత్రం
తెలుగు దినపత్రిక



నకిరేకల్, ఆగస్టు 20:

నకిరేకల్ పట్టణంలోని నారాయణ రెడ్డి ఫంక్షన్ హాల్ నందు నకిరేకల్ నియోజకవర్గ స్థాయి ూ×= రెండవ విడత ప్రక్రియ శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ముఖ్య అతిథిగా హాజరై దిశా నిర్దేశం చేశారు. శిక్షణలో భాగంగా ూ×= రెండవ విడతలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఓటర్ల జాబితా పరిశీలన, వివరాల సేకరణ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం గారు మాట్లాడుతూ "ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలి" అని అన్నారు.

పారదర్శకతకు ప్రాధాన్యత

ూ×= ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత

"ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు, దీూాలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి" అని ఎమ్మెల్యే గారు కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జు=ూ లెవల్ కోఆర్డినేటర్ చామల శ్రీనివాస్ గారు, సీనియర్ నాయకులు పూజర్ల శంభయ్య గారు, నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత దీూాలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నా కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు.. మంత్రి కొండా సురేఖ

అన్వేషనేత్రం, హైదరాబాద్ :



తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీకి వివరణ ఇచ్చారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిగా చేయడం సరికాదని సురేఖ స్పష్టం చేసినట్లు లేఖ రాసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని పేర్కొంటూ తనకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సుస్మిత ఇటీవల చేసిన తీవ్ర వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. సుస్మితకు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం లేకపోవడంతో ఆమెపై నేరుగా క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం లేదని పార్టీ నాయకత్వం భావించింది. దీంతో ఆమె వ్యాఖ్యలకు సంబంధించి మంత్రి కొండా సురేఖకు క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సురేఖ తాజాగా తన వివరణను క్రమశిక్షణా కమిటీకి సమర్పించారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలు తనకు సంబంధం లేని వ్యక్తిగత అభిప్రాయాలని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉన్న... రాజకీయ కక్షలతో ఉద్దేశపూర్వకంగా నన్ను బాధ్యురాలు చేయడం సరికాదని అన్నారు.



ఈరోజు మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రెడ్లు మరియు పండ్ల పంపిణీ కార్యక్రమంలోపాల్గొనడం జరిగింది కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగారం శంకర్ మాట్లాడుతూ భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారు 82వ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ దేశంలోని యువత 18 సంవత్సరాలకే తమకు నచ్చిన నాయకుని ఎన్నుకునే అవకాశాన్ని కల్పించి భారతదేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లిన మహానేత రాజీవ్ గాంధీ గారు మన హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని అన్నారు.



స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ నవీన్ యాదవ్ గారి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఎఓ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ టైగర్ ఆనంద్ గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యలయం మరియు యూసఫ్గూడ ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి రాజీవ్ గాంధీ గారి ఆదర్శాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఎఓ డిపార్ట్మెంట్ సులుగురు శివశంకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి లవకుమార్, జూబ్లెహిల్స్ ఎఓ డిపార్ట్మెంట్ చర్మన్ వీ వెంకటేష్, డివిజన్ ూజ సెల్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సాంకేతిక భారతానికి పునాదులు వేసి, అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి, ఆఖరి నిమిషం వరకు దేశం కోసమే బతికిన మహానేత, మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు..????.

మీ.

మాసనగారి సుమలత మాదిగ

ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోలు నియోజకవర్గం











స్వర్గీయ శ్రీ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా స్మరించుకొని కేక్ కట్ చేసిన ూజజ రాష్ట్ర వైస్ చైర్మన్ ూజ డిపార్ట్మెంట్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్ గారు, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షురాలు మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కోటేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ గుప్తా, ఓబీసీ విభాగం చైర్మన్ జవహర్ నగర్ పసుపులేటి వీరభాస్కరరావు, అనంతలక్ష్మి, సుబ్రమణ్యం, నర్సింగ్, ముఖేష్, చింతా విజయ, విజయ రాయ్, బొబిలి మంజుల సుంకరి శ్రీనివాస్, సాయి, మిగత కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

జోహార్ రాజీవ్ గాంధీ, జై కాంగ్రెస్ జై భారత్ జై సంవిధాన్








RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ఎఐపై పట్టు.. భవితకు మెట్టు!



కృత్రిమ మేధ (ఎఐ) విస్తరణతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భవిష్యత్తుపై చర్చ మొదలైంది. నిన్నటి వరకు మనిషి గంటల తరబడి చేసిన పనిని నేడు ఎఐ కొన్ని నిమిషాల్లో పూర్తి చేస్తోంది. కంటెంట్ రచన నుంచి సాఫ్ట్‌వేర్ కోడింగ్ వరకు, కస్టమర్ సేవల నుంచి డేటా విశ్లేషణ వరకు అనేక రంగాల్లో ఎఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. దీంతో ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన సహజమే. అయితే అసలు ముప్పు సాంకేతికతలో కాదు. దానికి అనుగుణంగా మన నైపుణ్యాలను మార్చుకోకపోవడంలో ఉంది. ఎఐ కొన్ని రకాల పునరావృత పనులను సులభంగా నిర్వహించగలదు. ఒకప్పుడు ఒక పనికి పలువురు ఉద్యోగులు అవసరమైతే.. ఇప్పుడు సాంకేతికత సహాయంతో అదే పనిని తక్కువ మంది పూర్తి చేయగలుగుతున్నారు. సంస్థలకు ఇది వ్యయ నియంత్రణ, వేగం, ఉత్పాదకతను పెంచే మార్గంగా కనిపిస్తోంది. ఫలితంగా సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు తప్పనిసరిగా వస్తున్నాయి. అయితే ఎఐ మనిషిని పూర్తిగా భర్తీ చేస్తుందనే భయం అంతగా వాస్తవికం కాదు. యంత్రానికి సృజనాత్మక ఆలోచన, మానవీయ అనుభూతి, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే సామర్థ్యం పరిమితమే. ఎఐ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలించి, సరైనదేదో నిర్ణయించి, దానికి మానవీయ విలువను జోడించేది మనిషే. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తుండటంతో ప్రపంచ ఉపాధి రంగం పెనుమార్పులకు లోనవుతోంది. మనిషి గంటల తరబడి చేసే పనులను ఎఐ ఆధారిత సాధనాలు నిమిషాల్లో పూర్తి చేస్తున్నాయి. కంటెంట్ తయారీ, సాఫ్ట్‌వేర్, కస్టమర్ సేవలు, డేటా విశ్లేషణ, అకౌంటింగ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో దీని వినియోగం పెరుగుతోంది. దీంతో ఉద్యోగ భద్రతపై ఆందోళన కూడా పెరుగుతోంది. అయితే ఎఐ వల్ల ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఎంతమంది ఉద్యోగాలు కోల్పోయారన్న దానికి ఖచ్చితమైన గణాంకం లేదు. కంపెనీలు ఉద్యోగ కోతలకు ఎఐతోపాటు పునర్వ్యవస్థీకరణ, ఆర్థిక పరిస్థితులు, ఆటోమేషన్ వంటి పలు కారణాలను చూపుతున్నాయి. అమెరికాలో ఉద్యోగ కోతలను నమోదు చేసే ఛాలెంజర్, గ్రే, క్రిస్మస్ సంస్థ మాత్రం 2023 నుంచి ఎఐను ప్రత్యేక కారణంగా నమోదు చేస్తోంది. ఆ సంస్థ తాజా గణాంకాల ప్రకారం 2023 నుంచి 2025 చివరి వరకు అమెరికాలో 71,825 ఉద్యోగ కోతల ప్రకటనలకు ఎఐ కారణంగా పేర్కొన్నారు. ఇందులో 2025 లోనే 54,836 ఉద్యోగ కోతలు ఎఐతో అనుసంధానించబడ్డాయి. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఎఐ ప్రభావం గణనీయంగా పెరిగిందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ సంఖ్యను ప్రపంచవ్యాప్తంగా ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్యగా భావించడం సరికాదు. ఇవి అమెరికాలో కంపెనీలు ప్రకటించిన ఉద్యోగ కోతల గణాంకాలు మాత్రమే. అయినప్పటికీ భవిష్యత్తులో మార్పు ఎంత వేగంగా ఉండబోతుందో ఇవి సూచిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక అంచనాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక, ఆర్థిక, జనాభా, పర్యావరణ మార్పుల ప్రభావంతో 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉండగా, 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడవచ్చని అంచనా వేసింది. అంటే మొత్తంగా 7.8 కోట్ల ఉద్యోగాల నికర పెరుగుదల ఉండొచ్చని పేర్కొంది. చాశ్రీంశీ =ఘుఀ – జెన్ జెడ్‌తో 'కమలం' అప్రమత్తం అందువల్ల సమస్య ఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోవడమే కాదు. ఉద్యోగాల స్వరూపం మారడం. పాత నైపుణ్యాలకు డిమాండ్ తగ్గుతూ, ఎఐ, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, సమస్య పరిష్కారం వంటి మానవ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి ఎఐని ఉద్యోగాల శత్రువుగా చూడటం కంటే.. దానిని ఉపయోగించగల నైపుణ్యాన్ని పెంచుకోవడమే పరిష్కారం. విద్యా సంస్థలు, ప్రభుత్వాలు, కంపెనీలు ఉద్యోగులకు పునఃశిక్షణ, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. నాస్కామ్– ఇండీడ్ విశ్లేషణ ప్రకారం భారత సాంకేతిక సంస్థల్లో ప్రస్తుతం 20 నుంచి 40 శాతం పని ఏదో ఒక రూపంలో ఎఐ సహాయంతో జరుగుతోంది. అదే సమయంలో మానవ పర్యవేక్షణ ఇంకా కీలకంగానే ఉందని నివేదిక పేర్కొంది. భారత ప్రభుత్వం కూడా పార్లమెంటులో ఇచ్చిన సమాధానంలో ఎఐ ప్రభావంతో కొన్ని ఉద్యోగాలు మారే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో డేటా సైన్స్, డేటా క్యూరేషన్ వంటి రంగాల్లో కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశముందని పేర్కొంది. 2027 నాటికి భారత్‌లో ఎఐ నిపుణుల సంఖ్య 6–6.5 లక్షల నుంచి 12.5 లక్షలకు పైగా పెరుగుతుందని నాస్కామ్ అంచనాను ప్రభుత్వం ప్రస్తావించింది. ఎఐ ఒకవైపు పునరావృతమైన, సులభంగా ఆటోమేట్ చేయగల పనులను తగ్గిస్తుంటే, మరోవైపు ఎఐని అభివృద్ధి చేయడం, నిర్వహించడం, పర్యవేక్షించడం, ఉపయోగించడం వంటి కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ముఖ్యంగా ఐటి రంగంలోని సాఫ్ట్‌వేర్ కోడింగ్, టెస్టింగ్, డేటా ప్రాసెసింగ్, కస్టమర్ సపోర్ట్ వంటి పనుల స్వరూపం మారుతోంది. అందుకే భవిష్యత్తులో 'ఎఐ వర్సెస్ మనిషి' కంటే 'ఎఐతో కలిసి పని చేసే మనిషి'కి ఎక్కువ ప్రాధాన్యం ఉండనుంది. ఇది ముఖ్యంగా యువత గుర్తించాల్సిన విషయం. డిగ్రీ, విద్యార్హతలతోపాటు ఎఐ సాధనాల వినియోగం, డేటా విశ్లేషణ, డిజిటల్ నైపుణ్యాలు, సృజనాత్మకత, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంచుకోవాలి. ఉద్యోగం కోసం ఎదురు చూసే తరం కాకుండా.. మారుతున్న సాంకేతికతను ఉపయోగించుకుని కొత్త అవకాశాలను సృష్టించే తరం కావాలి.

# ఎమిరేట్స్ విమానాల్లో పవర్ బ్యాంక్‌లు నిషేధం

**దుబాయ్:**

యుఎఇ జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ విమానాల్లో పవర్ బ్యాంక్‌ల వాడకాన్ని నిషేధించింది. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుండి అమల్లోకి వచ్చింది. కొత్త నిబంధన ప్రకారం, ప్రయాణీకులు తమ క్యాబిన్ బ్యాగేజీలో 100 వాట్–అవర్స్ కంటే తక్కువ సామర్థ్యం గల పవర్ బ్యాంక్‌ను తీసుకెళ్లవచ్చు. కానీ పవర్ బ్యాంక్‌ను విమానం అంతటా ఉపయోగించకూడదు. స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఛార్జ్ చేయడానికి లేదా విమానం సీటులోని విద్యుత్ సరఫరాను ఉపయోగించి పవర్ బ్యాంక్‌లను రీఛార్జ్ చేయడానికి పవర్ బ్యాంక్‌లను ఉపయోగించలేరు. ప్రమాదాలను తగ్గించడానికి, భద్రతను దృష్టిలో ఉంచుకోవడానికి ఈ చర్య తీసుకున్నట్లు ఎమిరేట్స్ అధికారులు తెలిపారు. అన్ని ఎమిరేట్స్ విమానాల్లో సీటులో ఛార్జింగ్ సౌకర్యాలు ఉన్నాయి. అయితే, ప్రయా




ణీకులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు %–% ముఖ్యంగా సుదూర విమానాల్లో %–% తమ పరికరాలను పూర్తిగా ఛార్జ్ చేయాలని ఎమిరేట్స్ తెలిపింది. ప్రయాణీకుల చేతుల్లో ఉన్న అన్ని పవర్ బ్యాంక్‌లు సామర్థ్యం, రేటింగ్ సమాచారాన్ని కలిగి ఉండాలి. పవర్ బ్యాంక్‌లను విమానం యొక్క ఓవర్‌హెడ్ స్టోవేజ్ బిన్‌లో ఉంచకూడదని ఎమిరేట్స్ ఆంక్షలు జారీ చేసింది. వాటిని సీటు జేబులో లేదా వాటి ముందు సీటు కింద ఉన్న బ్యాగ్‌లో ఉంచాలి. చెక్డ్ లగేజీలో పవర్ బ్యాంకులు అనుమతించబడవు. పవర్ బ్యాంకులలో ఉపయోగించే లిథియం బ్యాటరీల వల్ల కలిగే ప్రమాదాలను నివారించడానికి ఈ చర్య తీసుకోబడిందని వారు పేర్కొన్నారు.

## యుద్ధ విమానాల తయారీ పోటీలో అదానీ, టాటా..

న్యూఢిల్లీ : ఐదో తరానికి చెందిన యుద్ధ విమానాలను తయారు చేసేందుకు ఏడు భారతీయ కంపెనీలు రక్షణ మంత్రిత్వ శాఖకు బిడ్లు సమర్పించాయి. అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈ తరహా యుద్ధ విమానాలను దేశీయంగానే తయారు చేసుకుంటున్నాయి. వాటి సరసన చేరాలని నిర్ణయించుకున్న రక్షణ శాఖ దేశీయ కంపెనీల నుంచి బిడ్లను ఆహ్వానించింది. అత్యాధునిక మధ్య శ్రేణి యుద్ధ విమానాల (ఎఎంసిఎ) తయారీకి ప్రముఖ సంస్థలైన ఎల్ అండ్ టి, హాల్, అదానీ డిఫెన్స్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, కల్యాణ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ముందుకు వచ్చాయి. 2030వ దశకం మధ్య నాటికి ఈ విమానాలు రక్షణ శాఖకు అందుతాయి.

# తొలి ట్రిలియనీర్ దిశగా కుబేర ఎలాన్‌మస్క్ రికార్డు ..!

**ఇంటర్నెట్ :**

ఎలాన్‌మస్క్ రికార్డు సృష్టించారు. ఫోర్బ్స్ ప్రకారం %ా% ఎలాన్ మస్క్ చరిత్రలో తొలి వ్యక్తిగా 500 బిలియన్ డాలర్లకుపైగా సంపత్తి కలిగిన వ్యక్తిగా నిలిచారు. ఇది ప్రధానంగా టెస్లా షేర్ల విలువ పెరగడం, ఆయన ఇతర కంపెనీలు.. ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ, రాకెట్ కంపెనీ స్పేస్‌ఎక్స్.. విలువ పెరగడం వల్ల సాధ్యమైంది. బుధవారం మధ్యాహ్నం ఫోర్బ్స్ బిలియనేర్స్ జాబితాలో మస్క్ సంపత్తి 500.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. టెస్లా షేర్లు బుధవారం సుమారు 4 శాతం పెరిగి, మస్క్ సంపత్తిలో మరో 7 బిలియన్ డాలర్లు చేరువయ్యాయి. ఈ ఏడాదిలో టెస్లా షేర్లు 14 శాతం పైగా పెరిగాయి. సెప్టెంబర్ 15 నాటికి మస్క్ టెస్లాలో 12.4 శాతం వాటా కలిగి ఉన్నారు.

## టెస్లా బోర్డు మస్క్‌కి 1 ట్రిలియన్ డాలర్లు పరిహార ప్రణాళిక

వాహన అమ్మకాలు తగ్గడం, లాభాల ఒత్తిళ్లు వంటి సమస్యలతో టెస్లా షేర్లు "ప్రధాన ఏడు టెక్ కంపెనీలు" టెక్ స్టాక్‌లలో తక్కువ పెరుగుదల చూపాయి. ఇటీవల మస్క్ సుమారు 1 బిలియన్ డాలర్లు విలువైన టెస్లా షేర్లు కొని, కంపెనీ భవిష్యత్తుపై విశ్వాసం చూపించారు. గత నెలలో టెస్లా బోర్డు మస్క్‌కి 1 ట్రిలియన్ డాలర్లు పరిహార ప్రణాళిక ప్రతిపాదించింది, అలాగే ఆయనకు ఎక్కువ వాటా ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంది. ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ, స్పేస్‌ఎక్స్ కంపెనీల విలువ కూడా ఈ ఏడాదిలో పెరిగాయి. జూలైలో ఎక్స్ ఎఐ విలువ సుమారు 75 బిలియన్ డాలర్లుగా ఉంది. సిఎన్‌బిసి ప్రకారం %ా% ఎక్స్ ఎఐ 200 బిలియన్ విలువను సాధించడానికి ప్రయత్నిస్తోంది. కానీ మస్క్ ఆ సమయంలో ఇలాంటి ప్లాన్ లేదని చెప్పారు.రానున్న రోజుల్లో మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు టెస్లా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. రానున్న రోజుల్లో రోబోట్యాక్సీ, ఎఐ మార్కెట్ విస్తరణ వంటి లక్ష్యాలను పెట్టింది. ఈ పనితీరు లక్ష్యాలను ఎలాన్‌మస్క్ సాధిస్తే ప్రతిపాదిత ప్రోత్సాహక ప్యాకేజీ కింద ఆయనకు భారీగా షేర్లు సమకూరనున్నాయి. దాదాపు 900 బిలియన్ డాలర్లు సమకూరనున్నట్లు అంచనా. దాంతో ఆయన సంపద విలువ ట్రిలియన్ డాలర్లు దాటిపోవచ్చని అంచనా. అయితే ప్రస్తుతం ఆయన కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. చైనాలోని బీవైడీ తదితర కంపెనీల నుంచి పోటీ కూడా పెరిగింది. జర్మనీలో కూడా అమ్మకాలు పడిపోయాయి. ఈయూ దేశాల్లోను ఇదే పరిస్థితి. భారీ విస్తరణ అంచనాలను వెల్లడించింది.

## రెండవ అతి సంపన్నుడిగా లారీ ఎల్లిసన్

స్పేస్‌ఎక్స్ సుమారు 400 బిలియన్ డాలర్ల విలువతో ఇన్సైడర్ షేర్లు విక్రయించి నిధులు సమీకరించడానికి ప్రయత్నిస్తోందని జూలైలో బ్లూమ్బెర్గ్ తెలిపింది. ఈ కంపెనీల విలువ పెరగడం వల్ల మస్క్ సంపత్తి ఇప్పటివరకు రానంత ఎక్కువ స్థాయికి చేరింది. ఒరాకిల్ స్థాపకుడు లారీ ఎల్లిసన్ రెండవ అతి సంపన్నుడిగా, సుమారు 350.7 బిలియన్ డాలర్లు సంపత్తి కలిగి ఉన్నారు.




RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గోళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

బిజినెస్..

# గూగుల్‌లో 100 మంది ఉద్యోగులపై వేటు

**గూగుల్ :**

టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి ఉద్యోగులపై వేటు వేసింది. క్లౌడ్ విభాగంలో డిజైన్ సంబంధిత రంగాల్లో పనిచేసే 100 మందిని ఈ వారం తొలగించినట్లు సీఎన్‌బీసీ వెల్లడించింది. వీరిలో క్వాంటిటేటివ్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ రీసెర్చ్ బృందం, ప్లాట్‌ఫామ్ అండ్ సర్వీస్ ఎక్స్‌పీరియన్స్ టీం లో సభ్యులు అధికంగా ఉన్నారు.వీరు వినియోగదారుల తీరును డేటా, సర్వేలు, రీసెర్చ్ ఆధారంగా విశ్లేషించే రోల్స్‌లో పనిచేస్తున్నారు. వీరు ఇచ్చే సమాచారం ఆధారంగా గూగుల్ ప్రొడక్ట్‌లను డిజైన్ చేస్తుంది. దీంతోపాటు కొన్నిరకాల క్లౌడ్ డిజైన్ టీమ్‌లను సగానికి కుదించినట్లు తెలుస్తోంది. తాజాగా ఉద్యోగాలు కోల్పోయినవారిలో అత్యధికంగా అమెరికన్లే ఉన్నారు. ఇక మిగిలినవారిని ప్రత్యామ్నాయ పోస్టుల్లో నియమించింది. కృత్రిమ మేధలో కీలకంగా మారేందుకు గూగుల్ చేపట్టిన పున: వ్యవస్థీకరణలో భాగంగానే ఈ లేఆఫ్‌లు విధించారు. గత నెల జెమినీ, ఏఐ ఓవర్ వ్యూ విభాగాల్లో పనిచేస్తున్న 200 మందికి పైగా కాంట్రాక్ సిబ్బందిని గూగుల్ తొలగించింది. ఈ చర్యలతో ఆ సంస్థలోని చాలామంది సిబ్బందిలో ఉద్యోగ భద్రత, తక్కువ వేతనాలు వంటివాటిపై ఆందోళన చెందుతున్నారని వైర్డ్ సంస్థ కథనంలో పేర్కొంది. అయితే ఉద్యోగులు పని వాతావరణంపై మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నించినందుకే ఈ చర్యలు తీసుకొన్నట్లు ప్రచారం కూడా జరిగింది. ఇక ఈ ఏడాది ప్రారంభంలో క్లౌడ్ విభాగంలో సిబ్బందిని గణనీయంగా తగ్గించింది. తమ వ్యాపారానికి కీలక విభాగాలకు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని నాడు గూగుల్ పేర్కొంది. గ్లోబల్ బిజినెస్, ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ డివిజన్‌లో కూడా తన సిబ్బందిని తగ్గించుకుంది. ఇక 2025 ప్రారంభంలో మానవ వనరుల విభాగం, హార్డ్‌వేర్, సెర్చ్, యాడ్స్, మార్కెటింగ్, ఫైనాన్స్, కామర్స్ విభాగాల ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ప్యాకేజీని ప్రకటించింది.

## మిడిల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

గూగుల్ మేనేజ్‌మెంట్‌లోని వరుస క్రమాన్ని బాగా తగ్గిస్తోంది. మూడోవంతు మధ్యస్థాయి మేనేజర్లను తొలగించింది. చిన్న టీంలను పర్యవేక్షించేవారు ఈ జాబితాలో ఉన్నారు. నిర్ణయాలు వేగంగా తీసుకోవడం, కార్యకలాపాలను ఓ దారిలోకి తీసుకురావడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 2024 డిసెంబర్ నాటికి లేఆఫ్‌ల తర్వాత 1,83,323 మంది ఉద్యోగులు ఈ సంస్థలో పనిచేస్తున్నారు.

అన్వేషనేత్రం

# సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ బాటలు... నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత





**నల్లగొండ, ఆగస్టు 20 ( అన్వేషనేత్రం ప్రతినిధి )**

దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని నల్గొండ జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించేందుకు రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని కొనియాడారు. టెలిఫోన్, కంప్యూటర్ వంటి ఆధునిక సాంకేతికతలను దేశంలో విస్తృతంగా ప్రవేశపెట్టి అభివృద్ధికి పునాదులు వేశారని పేర్కొన్నారు. యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించే ఉద్దేశంతో ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ సేవలను ప్రజలు ఎన్నటికీ మరువరని కైలాష్ నేత అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లాపల్లి పరమేష్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చింత యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ముంతాజ్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి దొండ రమేష్, జిల్లా కార్యదర్శి దామనూరి అశోక్, పగిళ్ల రాజు, చర్లపల్లి గౌతమ్, పళ్ళ రవితేజ, ఎండి అజీజ్, మట్టపల్లి నాగరాజ్, శ్రీనివాస్, వేముల గోపీనాథ్, ఇందనూరి శ్రీను, బోడ అరుణ్, జమ్ము అశోక్, లింగస్వామి, యాదగిరి, మాచగిరి, గణపురం మహేష్, పున్న గణేష్, కత్తుల గణేష్, అనిల్ కుమార్, నల్లబోతు శంకర్, అకంటి సైదులు, యశ్వంత్, రాజేష్, బాలకృష్ణ, పులుసు నాగార్జున, సచిన్, వినీత్, శరత్, పాల్గొన్నారు.

# భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన అమూల్యమైన సేవలను స్మరించుకుందాం.




ఆధునిక భారత నిర్మాణానికి దూరదృష్టితో పునాదులు వేసిన మహానేత రాజీవ్ గాంధీ గారు. కంప్యూటర్, టెలికాం రంగాలకు ప్రోత్సాహం అందించి భారతదేశాన్ని సాంకేతికంగా ముందుకు నడిపించారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని పెంచారు. విద్యారంగంలో జవహర్ నవోదయ విద్యాలయాలకు పునాది వేసి గ్రామీణ ప్రతిభకు అవకాశాలు కల్పించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసి, మహిళలు మరియు బలహీన వర్గాలకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని నిర్మించాలన్న ఆయన దూరదృష్టి నేటి డిజిటల్ భారతంలో సాక్షాత్కరిస్తోంది. రాజీవ్ గాంధీ గారి ఆశయాలను స్మరించుకుంటూ, ప్రగతిశీల భారతదేశ నిర్మాణానికి పునరంకితం కావడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.
జోహార్ రాజీవ్ గాంధీ! ????

ఇట్లు,
కేతిరెడ్డి శకుంతలరెడ్డి
వర్కింగ్ ప్రెసిడెంట్
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా సేవాదళ్

# టిపిసిసి క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ

తన వివరణతో కూడిన లేఖను టిపిసిసి క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి గారికి పంపించిన మంత్రి సురేఖ గారు టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు సంబంధించి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు గురువారం తన వివరణతో లేఖను కమిటి ఛైర్మన్ మల్లు రవి గారికి పంపించారు. లేఖలో క్రమశిక్షణా కమిటీకి మంత్రి తన వివరణ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆగస్టు 19న తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'కొండా' కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలుచోట్ల వేడుకలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారని లేఖలో మంత్రి తెలిపారు. తన స్వస్థలమైన గీసుకొండతో తన కూతురు సుస్మితా పటేల్ కు వున్న ప్రత్యేక అనుబంధం కారణంగా అక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు. ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన వివరణ కోరడం సముచితం కాదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన



వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ విషయంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీకి గౌరవపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.




సాంకేతిక భారతానికి పునాదులు వేసి, అణగారిన బతుకుల్లో వెలుగులు నింపి, ఆఖరి నిమిషం వరకు దేశం కోసమే బతికిన మహానేత, మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు..????.
మీ.
శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్




భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన అమూల్యమైన సేవలను స్మరించుకుందాం. ఆధునిక భారత నిర్మాణానికి దూరదృష్టితో పునాదులు వేసిన మహానేత రాజీవ్ గాంధీ గారు. కంప్యూటర్, టెలికాం రంగాలకు ప్రోత్సాహం అందించి భారతదేశాన్ని సాంకేతికంగా ముందుకు నడిపించారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యాన్ని పెంచారు.
విద్యారంగంలో జవహర్ నవోదయ విద్యాలయాలకు పునాది వేసి గ్రామీణ ప్రతిభకు అవకాశాలు కల్పించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసి, మహిళలు మరియు బలహీన వర్గాలకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించారు. 21వ శతాబ్దపు భారతదేశాన్ని నిర్మించాలన్న ఆయన దూరదృష్టి నేటి డిజిటల్ భారతంలో సాక్షాత్కరిస్తోంది.
రాజీవ్ గాంధీ గారి ఆశయాలను స్మరించుకుంటూ, ప్రగతిశీల భారతదేశ నిర్మాణానికి పునరంకితం కావడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.
జోహార్ రాజీవ్ గాంధీ! ????

ఇట్లు,
తోట దేవి ప్రసన్న
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్
పార్టీ అధ్యక్షురాలు

# రాజీవ్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం

**రాజీవ్ వల్లే దేశంలో సాంకేతిక విప్లవం**

**ఆయన కృషితోనే ఐటీ, టెలికాం రంగాల అభివృద్ధి**

**దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు :20 (అన్వేషనేత్రం ):**

దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదే అని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ వైస్ చైర్మన్ యం.డి. షఫీ ఉల్లా అన్నారు. స్వర్గీయ మాజీ ప్రధాని,భారత రత్న, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో జమ్మిగడ్డలో రాజీవ్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు. దేశ సమగ్రత కోసం, సమైక్యత కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం. ఆయన జయంతి సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను,



ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వారి స్ఫూర్తితో మళ్లీ దేశ సమగ్రతను కాపాడేందుకు పునరంకితమవుదాం" అని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు భవిష్యత్తులో రాజకీయంగా, సామాజికంగా ఉన్నత పదవుల్లో అవకాశాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరు రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, తన్వీర్ హుసేన్, ఎస్ కె జహీర్, ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణా రెడ్డి, వీరన్న నాయక్, పారూక్, పోలగాని బాలు గౌడ్, కమ్మరికుంట్ల లింగయ్య, కోడి శివ, బండారు వెంకన్న, గడ్డం వెంకన్న, సాజిద్, అక్కినపల్లి జానయ్య, రుద్రంగి రవి, పడిదల రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు

**ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

**సర్ ఫేజ్ 2 పై సూర్యాపేటలో అవగాహన**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగష్టు 20 ( అన్వేషనేత్రం):**

సూర్యాపేట ప్రతినిధి: ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు అని ఓటు హక్కు ను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట నియోజకవర్గ సమన్వయకర్త కుసుబా శ్రీనివాస్, అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సర్ ఫేజ్ 2 పై అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో రెండు లక్షల పైగా ఓట్లను డ్రాప్ లిస్టులో పెట్టారని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ ఎస్ పార్టీ ఎలక్షన్ కమిషన్ ఏజెంట్ గా పని చేస్తున్నాయని దుయ్యబట్టారు. డ్రాప్ లిస్టులో వచ్చిన ఓటర్ లు అధైర్య పడకుండా ఫామ్ 8 ద్వారా మార్చుకునే అవకాశం ఉంటుందని భరోసా కల్పించారు. 13 రకాల కారణాలతో ఓట్లను తీసేసారని బి ఎల్ వో ల ద్వారా ఎన్యూమరేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఓటు బ్యాంకు ను కాపాడేలా బిఎల్ఏలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు భయపడాల్సిన అవసరం లేదు.. డాక్టర్ రోహన్ రెడ్డి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు :20 (అన్వేషనేత్రం):**

ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని యశోద ఆసుపత్రి సోమాజిగూడ శాఖకు చెందిన థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థొరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స కాదని, గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కార్డియో థొరాసిక్ సర్జరీగా పిలుస్తారని తెలిపారు. ఊపిరితిత్తులు, ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా థొరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు. ముఖ్యంగా కొవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యశోద ఆసుపత్రి సోమాజిగూడలో పల్మనాలజీ, థొరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలూ అందిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) సేవలను కూడా ప్రారంభించామని, ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి పలువురు రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజెస్, ధూమపానం కారణంగా వచ్చే సీఓపీడీ వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాంటి రోగులు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ, ఆయాసంతో జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటారని, వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. క్షయ వ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో కొంత భాగం దెబ్బతినడం, దగ్గులో రక్తం పడటం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు కూడా శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. మినిమల్ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతోనే ఊపిరితిత్తుల్లోని వ్యాధిగ్రస్త భాగాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల పరిమాణంలో చిన్న కోతలతో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనికి మరింత ఆధునిక రూపంగా రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిందని, యశోద ఆసుపత్రిలో ఈ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స అంటే చాలా ప్రమాదకరమని భావించి రోగులు భయపడేవారని, ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించగలుగుతున్నామని డాక్టర్ రోహన్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు.
తాను కూడా సూర్యాపేటకు చెందినవాడినని, తన ప్రాంత ప్రజలకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉంటే భయపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో ఎవరికైనా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఉంటే ఈ సమాచారాన్ని వారికి చేరవేయాలని మీడియా ప్రతినిధులను కోరారు.




ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ఇకపై భయపడాల్సినంత ప్రమాదకరమైనవి కావు. ఆధునిక మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ థొరాసిక్ సర్జరీలతో సురక్షితంగా చికిత్స అందించవచ్చు. అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా సాధ్యమే. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు" అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.








**నకిరేకల్:**

ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎవీ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ బోర్డును ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ప్రారంభించారు. ఈ డిజిటల్ స్క్రీన్ బోర్డులను రామన్నపేట లయన్స్ క్లబ్ వారు డొనేట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు డిజిటల్ స్క్రీన్ బోర్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.విద్యా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న రామన్నపేట లయన్స్ క్లబ్ సభ్యులను ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా అభినందించారు.

# నల్గొండలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

## హైదరాబాద్‌కు వెళ్లకుండానే ఆధార్ సమస్యల పరిష్కారం.. జిల్లా ప్రజలకు అందుబాటులోకి సేవలు

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నల్గొండ, ఆగస్టు 20 (అన్వేషనేత్రం ప్రతినిధి):**





ఆధార్‌లో మార్పులు, చేర్పులు, సవరణలు, ఇతర సమస్యల పరిష్కారానికి నల్గొండ జిల్లా కేంద్రంలో ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. నల్గొండ--హైదరాబాద్ ప్రధాన రహదారిలోని పద్మానగర్ పాల కేంద్రం వద్ద కేంద్ర యూఐడీఏఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధార్ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమైన గుర్తింపు పత్రంగా మారిందన్నారు. ఆధార్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నల్గొండలోనే సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. తెలంగాణలో ఇది ఐదో ఆధార్ సేవా కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలతోపాటు నల్గొండ నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రం ఆదివారం కూడా పనిచేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో వందేళ్లకు పైబడిన వారు సుమారు 200 మంది ఉన్నట్లు కలెక్టర్ ద్వారా తెలిసిందని మంత్రి తెలిపారు. సాంకేతిక కారణాలతో కొందరి పుట్టిన తేదీల్లో తప్పులు నమోదైనట్లు పేర్కొన్నారు. సంబంధిత తహసీల్దార్ల ద్వారా వారిని నల్గొండ ఆధార్ సేవా కేంద్రానికి తీసుకువచ్చి వయస్సు, పుట్టిన తేదీ వివరాలను సరిచేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అదనపు ఖర్చు లేకుండా, హైదరాబాద్‌కు వెళ్లే ఇబ్బంది లేకుండా ఆధార్ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే అవకాశం లభించిందన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధార్‌లో తప్పులు ఉంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా నల్గొండలోని సేవా కేంద్రంలోనే నిర్దేశిత రుసుము చెల్లించి సవరణలు చేసుకోవచ్చున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల వరకు ఆధార్ నమోదుకు ఈ కేంద్రంలో అవకాశం ఉందని తెలిపారు.



నిర్ణీత పనిదినాలు, వేళల్లో కేంద్రం పనిచేస్తుందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఈడీఎం దుర్గారావు, యూఐడీఏఐ ఆధార్ సేవా కేంద్రం సంస్థ ప్రతినిధులు డైరెక్టర్ భారతి, మేనేజర్ హరినాథ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.








**నకిరేకల్, ఆగస్టు 20:**

భారతరత్న, భారత మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత శ్రీ రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా నకిరేకల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు రాజీవ్ గాంధీ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రాజీవ్ గాంధీ గారి సేవలను కొనియాడారు. "18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా యువత రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచిన చారిత్రాత్మక నిర్ణయం రాజీవ్ గాంధీ గారిదే" అని అన్నారు.దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లి, ఐటీ విప్లవానికి పునాదులు వేసిన దూరదృష్టి గల నాయకుడిగా రాజీవ్ గాంధీ అని అభివర్ణించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల భారంలోకి నెడుతోందని, పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, మత విద్వేషాలను పెంచుతోందని ఎమ్మెల్యే గారు విమర్శించారు.యువత, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ గారు అని, ఆయన ప్రధానమంత్రి అయితే ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆకాంక్షించారు. రాజీవ్ గాంధీ గారి ఆశయాలకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల ఓటరు నమోదును కార్యక్రమంను ఈ సందర్బంగా ప్రారంభించారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కరెంట్ కష్టాలపై రైతుల ఆగ్రహం.. విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముట్టడి: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నల్లగొండ, ఆగస్టు 20 (అన్వేషనేత్రం ప్రతినిధి):**

రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు గురువారం నల్లగొండలో ఆందోళనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో వందలాది మంది రైతులతో కలిసి ట్రాన్స్‌కో విద్యుత్ ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడించారు. తక్కువ వోల్టేజీ కారణంగా కాలిపోయిన బోరు మోటర్లు, విద్యుత్ సరఫరా లేక ఎండిపోయిన వరి కట్టలను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయం





ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించామని, ప్రస్తుతం అధికారిక లెక్కలకు, క్షేత్రస్థాయిలో సరఫరా పరిస్థితులకు పొంతన లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలి: రైతులకు కోతలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని లింగయ్య డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న తక్కువ వోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించి బోరు మోటర్లు కాలిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ అంతరాయాలు, తక్కువ వోల్టేజీ కారణంగా దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి, బాధితులకు ఎకరాకు తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతు బీమా బకాయిలు చెల్లించాలి: ప్రీమియం చెల్లించక నిలిచిపోయిన రైతు బీమా పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీమా సొమ్ము అందక రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న మృత రైతుల కుటుంబాలకు బకాయిలను తక్షణమే విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని లింగయ్య హెచ్చరించారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 81వ జన్మదిన వేడుకల్లో చక్రహరి రామరాజుకు ఘన సత్కారం

**నల్లగొండ, ఆగస్టు 20 ( అన్వేషనేత్రం ప్రతినిధి )**




తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తొలి, మలి దశల్లో కీలకంగా పోరాడిన ఉద్యమకారుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మహాత్మా జ్యోతిబా పూలే అవార్డు గ్రహీత చక్రహరి రామరాజు 81వ జన్మదిన వేడుకలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన సేవలను కొనియాడారు.వృత్తులు వేరైనా.. మా నెత్తురు ఒక్కటే అన్న స్ఫూర్తితో బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం రామరాజు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి బీసీ సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వనాథం,కంది సూర్యనారాయణ,వెంకటేశం, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో నాణ్యత పెంచాలి

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఆగస్టు 20 (అన్వేషణేత్రం ప్రతినిధి): కేసుల దర్యాప్తులో నాణ్యత పెంచడంతోపాటు పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయం, డిండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లోని కేసుల దస్త్రాలు, నేర నమోదు వివరాలు, పెండింగ్ కేసుల రికార్డులు, పరిపాలనా పత్రాలను పరిశీలించారు. ముఖ్యంగా తీవ్ర నేరాలకు సంబంధించిన దస్త్రాలతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు తీరును సమీక్షించారు. ఒక్కో కేసులో దర్యాప్తు ఏ దశలో ఉంది, సేకరించిన ఆధారాలు, నిందితుల అరెస్టు, అభియోగపత్రాల దాఖలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హత్యలు, హత్యాయత్నాలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలు, చిన్నారులపై నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. సంఘటనా స్థలంలో లభించే ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, పటిష్టమైన సాక్ష్యాలతో కేసులను న్యాయస్థానంలో నిలబెట్టేలా దర్యాప్తు సాగించాలని స్పష్టం చేశారు. నేరాన్ని ఛేదించడంతోపాటు నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా అన్ని కోణాల్లో విచారణ జరపాలని తెలిపారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే ప్రతి కేసుకు




సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పత్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని ఆదేశించారు. దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక, నేర ప్రభావిత, సున్నిత ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి చట్టబద్ధంగా పరిష్కరించాలన్నారు. పోలీసులపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడానికే పరిమితం కాకుండా ముందస్తు చర్యలతో నేరాల నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. తనిఖీలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డిండి సీఐ బిసన్నతోపాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**నల్లగొండ,ఆగస్టు 20( అన్వేషనేత్రం ప్రతినిధి )**

దేశానికి సాంకేతిక విప్లవాన్ని పరిచయం చేసి, పేదలు, యువత సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా నల్గొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లౌకికవాద సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముందుచూపుతో రాజీవ్ గాంధీ దేశంలో సాంకేతిక విప్లవానికి పునాది వేశారని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనదేనన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రాజీవ్ గాంధీ త్యాగాల కుటుంబానికి చెందిన మహానేతగా నిలిచిపోయారని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఆ దిశగా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సోనియా గాంధీని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరువరని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి,



మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జెడ్పీటీసీలు గుమ్మల మోహన్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్, కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస గౌడ్, స్థానిక కార్పొరేటర్ ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు హాజరయ్యారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

## ఆట



# భారత్ విజయం లాంఛనమే!!

శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(69 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. దేవదత్ పడిక్కల్(75 బంతుల్లో 6 ఫోర్లతో 44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు వికెట్లు తీయగా.. ప్రభాత్ జయసూర్య(3/43) మూడు వికెట్లు పడగొట్టాడు. కేశర నువాంత ఒక వికెట్ తీయగా.. లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది. నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. యశస్వి జైస్వాల్.. మూడో బంతికే డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) వేగంగా పరుగులు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా.. పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 116/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా.. రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. అయితే మూడో సెషన్ ఆటకు ముందు వర్షం అంతరాయం కలిగించింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కెప్టెన్ ధనంజయ డిసిల్వా(73 బంతుల్లో 3 ఫోర్లతో 31 నాటౌట్), సొనాల్ దినుషా(36 బంతుల్లో 4 ఫోర్లతో 25 నాటౌట్) మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.

# ధ్రువ్ జురెల్ స్టన్నింగ్ క్యాచ్‌పై దుమారం

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. ఎల్బీడబ్ల్యూ, క్యాచ్‌ల విషయంలో అంపైర్లపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అంపైర్ల తీరు కారణంగానే తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసిందని మూడో రోజు ఆట అనంతరం భారత స్పిన్నర్ మానవ్ సుతార్ అనడం తీవ్ర వివాదాస్పదమైంది. నాలుగో రోజు ఆటలో కేఎల్ రాహుల్ ఎల్బీడబ్ల్యూ విషయంలో అంపైర్ ఘోర తప్పిదం చేయడం.. డీఆర్ఎస్ ద్వారా అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఆఖరి సెషన్‌లో భారత ఫీల్డర్ ధ్రువ్ జురెల్ అందుకున్న లో–క్యాచ్‌పై కూడా దుమారం రేగుతోంది. శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉడారా ఇచ్చిన లో– స్లిప్ క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా అందుకున్నాడు. అయితే క్యాచ్ అందుకునే క్రమంలో బంతి నేలకు తాకినట్లుగా రిప్లేలో కనిపించింది. కానీ ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై శ్రీలంక కోచ్‌లు, ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీలంక రెండో ఇన్నింగ్స్ సందర్భంగా మానవ్ సుతార్ వేసిన 22వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ నాలుగో బంతిని లాహిరు ఉడారా డిఫెన్స్ చేయగా బంతి గల్లీ వైపు లో–క్యాచ్‌గా వచ్చింది. అక్కడే ఉన్న ధ్రువ్ జురెల్ బంతిని అద్భుతంగా అందుకున్నాడు. రిప్లేలను పరిశీలించిన అంపైర్ బంతి కింద చేతివేళ్లు ఉన్నాయని ఔటిచ్చాడు. అయితే ఈ నిర్ణయంపై లాహిరు ఉడారా అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనంగా క్రీజును వీడాడు. ప్రస్తుతం ఈ క్యాచ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# శ్రీలంక ఆటగాడి మెడకు తీవ్ర గాయం..

భారత్, శ్రీలంక మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో దురదృష్టకర ఘటన చోటు చేసుకుంది. మంగళవారం నాలుగో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తూ శ్రీలంక ఫీల్డర్ దినేష్ చండీమల్ తీవ్రంగా గాయపడ్డాడు. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో అదుపుతప్పి కిందపడిపోయిన చండీమల్‌కు మెడతో పాటు కుడి భుజానికి బలమైన గాయమైంది. దాంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. నాలుగో రోజు ఆట తొలి సెషన్ ఆరంభంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. కేశర నువాంత వేసిన నాలుగో ఓవర్ ఆఖరి బంతిని కేఎల్ రాహుల్.. స్వీప్ షాట్‌తో డీప్ బ్యాక్‌వార్డ్ స్క్వేర్ లెగ్ దిశగా ఆడగా.. దినేష్ చండీమల్ పరుగెత్తుకుంటూ వచ్చి బంతిని ఆపే ప్రయత్నంలో కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతని కుడి భుజం బలంగా నేలకు తాకడంతో మెడకు తీవ్ర గాయమైంది. ఫిజియోలు పరీక్షించి అతన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే అతని స్కానింగ్ తీయించామని, అంతర్గత గాయాలు ఏమి లేవని శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. కంకషన్ టెస్ట్‌లో చండిమాల్ విఫలమయ్యాడని, దాంతో అతను ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని తెలిపింది. అతని స్థానంలో పసిందు సూర్య బండార ఆడుతాడని పేర్కొంది. కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కు మ్యాచ్ రిఫరీ ఆమోదం తెలిపారని తమ ప్రకటనలో స్పష్టం చేసింది. దాంతో అనూహ్య పరిస్థితుల్లో సూర్య బండార అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి అరంగేట్రం చేశాడు. అయితే తన రాకను ఘనంగా చాటుకోలేకపోయాడు. 372 పరుగుల లక్ష్య ఛేదన కోసం శ్రీలంక రెండో ఇన్నింగ్స్ ప్రారంభించగా.. సూర్య బండార(0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మానవ్ సుతార్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. మానవ్ సుతార్‌తో పాటు సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సత్తా చాటడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. క్రీజులో కెప్టెన్ దనంజయ డిసిల్వా(24 బ్యాటింగ్), సోనాల్ దినుషా(8 బ్యాటింగ్) ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు అవసరం కాగా.. శ్రీలంక 300 ప్లస్ రన్స్ చేయాల్సి ఉంది.




RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# జీ5లో స్ట్రీమింగ్ కానున్న జననాయకుడు

కోలీవుడ్ స్టార్ హీరో, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమా త్వరలోనే ఓటీటీ ప్రేక్షకులను అలరించనుంది. సెన్సార్ సమస్యలు మరియు వివిధ కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎట్టకేలకు జూలై 23న థియేటర్లలో విడుదలైంది. థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ మూవీని ప్రముఖ డిజిటల్ ఎ÷–లాట్‌ఫామ్ జీ5 (జిఇఇ5) సంస్థ అధికారికంగా ఓటీటీలోకి తీసుకువస్తోంది. ఆగస్టు 21వ తేదీ నుంచి ఈ సినిమా జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక వెల్లడించారు మేకర్స్. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో ఒకేసారి ఈ డిజిటల్ ప్రీమియర్ అందుబాటులోకి రానుంది. అయితే, హిందీ వెర్షన్ మాత్రం కొద్ది వారాల తర్వాత స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ డియోల్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. విజయ్ కెరీర్‌లో చివరి సినిమా కావడంతో పాటు థియేటర్లలో ఈ చిత్రాన్ని మిస్సయిన అభిమానులు ఓటీటీలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434